# "దేవీపథ"

[ కథానిక ]

●

= శ్రీ రాంగోపాల్ =

రాత్రి పదకొండు కావస్తోంది. కృష్ణపక్ష అంతరిక్షంలో చంద్రయ్యజాడ యింకా లేక, నక్షత్రాలు తైతక్కలాడుతున్నాయి. నిడదవోలుస్టేషను ప్లాటుఫారం గ్యాసుదీపాలుకూడా, పురుగులమధ్య అజ్ఞాతవాసాలు చేస్తూ, అంధకారాన్ని సూచిస్తున్నాయి. కాలవకవతల, దూరాలనించి, నక్కలవోలలకి ఏవేవో కలలూ, దయ్యాలకథలూ నరాలమ్మట ఝల్లుమంటున్నాయి.

తెల్లారుఝామునించి, తారమధ్యమాలకి తక్కువకాకుండా ఖంగుమన్న అమ్మకాల గొంతుకలు పూర్తిగా మందరస్థాయిలో పడి మాటుమణుగుతున్నాయి. ఇసకరాలని జనసమూహాలలోనించే ఎంతలేసి సామానులైనా దింపి ఎక్కించేసే లైసెన్సుకూలీల చలాకీలు, రోజుకష్టంచేత యింటిదృష్టిలో చాలామట్టుకు చప్పబడ్డాయి. పెద్దగేటుదగ్గర టిక్కెట్టుకలెక్టరు ప్రయాణీకులని దండుకోడం అశ్రద్ధచేసి ఆవులిస్తున్నాడు.

ఇంక పదినిముషాలు — మా నరసాపురంబండి కూడా నడుస్తుంది. చదవాల్సిన గ్రంథవిస్తారం బెంగచేత పరీక్షలముందు కాలేజీకుర్రాడికిమల్లే, వెళ్లాల్సిన దూరభారస్పృహలో విధిలేక ఎలాగో వొళ్లు విరుచుకుని, మా రైలుకూడా బయల్దేరాలంటోంది.

ఉన్న చుట్టముక్క గుక్కెడూ పీల్చిపారేసి, ఖాళీగావున్న వొక చిన్న పెట్టెలో ఎక్కాను. గ్రీష్మతాపంలో పగలంతా మాడి వాడిన గాలిదేవుడు పూర్తిగా సొమ్మసిల్లి పడుకున్నాడు. స్థలంలో దొరకని తెరిపి చలనంలో కాస్త అనుభవిద్దామని, చొక్కా గుండీలు విప్పి, రైలుపెట్టెగుమ్మందగ్గరే నుంచున్నాను.

చెల్లాయి చిట్టి పట్టుకురమ్మన్న వోణీలు మరిచిపోయానని జ్ఞాపకంవచ్చింది. మా నానప్పలాగులూ, చంటాడికి పాలపీకలూ—వెధవసినిమాకి వెళ్లకపోయినా తీరిపోను!......అయినా, ఆ స్కూలు వదలి బయటపడగానే, పెంద్రాళే నాలుగు పనులూ చూసుకుని సాయంత్రం బండికే వచ్చెయ్యకుండా, ఎక్కడ్డో దానవాయిపేటసివార్లలో ఆ ప్లీడరుగారి అమ్మాయి 'ట్యూష'నొకటి! మానేస్తే...? ఏదో ఆ పదిరాళ్లూ వస్తుండబట్టే రైలుఖర్చులయినా ఎత్తిపోతున్నాయి. అదీగాక, పాపం, తల్లిలేని పిల్ల!...ఏదో మాటల సందర్భం వచ్చి, "పెళ్లి కేంలెండి మాష్టారూ, నాలుగు ముక్కలొస్తే, ఆ తర్వాత...దాని యిష్టం..." అంటూ కంట నీరెట్టుకున్నాడాయన. పెద్దకూతురు తలపుకొచ్చిందికాబోలు!...లక్ష్మీదేవిట! ఎంత చక్కటి పేరు!...చిన్నప్పుడే చేసిన మేనత్తకొడుకు కిష్టంలేక, యీడొచ్చాక, యింకోడితో లేచిపోతా నందని కొందరూ, లేచేపోయిందనీ కొందరూ—ఆ పిల్లని గురించి ఎన్ని పుకార్లు! ఎన్ని పురాణాలు!—ఏమిటో, పాడులోకం!...తండ్రికూడా, పాపం, తిట్టాడుట...కొట్టాడుట...ఎన్ని బాధలు పెట్టినా లక్ష్మి మనస్సు తిప్పలేక, చివరికి "యిదేం అప్రతిష్ఠ మొర్రో" అని, చిర్రెత్తిక్కిపోయి, బలవంతంగా అత్తారింటికి నెట్టేశాడుట!...మొదట, 'ఏల'నని బెదిరించిన మొగుడు, రెండువేల కరుకు లట్టుకెళ్లాటప్పటికి మళ్లీ ప్రసన్నం

అయాడుట!...కాని, కార్యంనాడే లక్ష్మి మంచం పట్టి—ఆ జ్వరం జ్వరం క్రమంగా క్షయలో దింపి, అంతా ఆరునెలలకిందటే ప్రాణాలు తీసేసిందిట... "అందమైన పిల్లలని చూశానుగాని, బాబూ, ఆ పిల్ల అందమే వేరండీ—నిజంగా దణ్ణంపెట్టబుద్ధేసేది!" అని వంటలక్క ఆ కథ అంతా చెబుతూంటే 'అబ్బా!' అనిపించింది.

వాళ్లకక్కయ్యమాటొస్తే చాలు, కమలంకూడా అంతే. "బావని బావంటే, అన్నయ్య అనమనేది. 'ఎవరికే అన్నయ్య?' అంటే, 'నీకూ నాకూ కూడా' నని అదోయిదిగా చూస్తూ, నన్ను మెల్లిగా ముద్దెట్టుకునేది...అక్కకి నేనంటే ప్రాణమండీ మేష్టారూ..." అని పన్నెండేళ్ల కమలం ఎంతో కష్టాలనుభవించిన దానికిమల్లే కన్నీళ్లెట్టుకునేది...నిజంగా ఏమిటో యీ సంసారాలూ, యీ గొడవలూను!...అమ్మకి కొత్త సుఖనివ్వగానే రాజమండ్రీకే మకాం మార్చెయ్యాలి ...ఉద్యోగం ఒక వూరూ, వుండడం యింకోవూరూ.. మాచెడ్డ అవస్థగా వుంది...శుక్రవారం ఎప్పుడు వస్తుందా అని ఎదురుతెన్నులు చూస్తుండడం, వారం అంతా యింటిదగ్గిర కుర్రకుంకలమీదే ధ్యాస—యీ పద్ధతేం బాగాలేదు...యీ 'టెంపొరరీవేకెన్సీ' ఆరునెలలేనే ఖర్మం?...ఆ, అప్పటిమాటచూసుకోవచ్చు...అయినా, ఎన్నాళ్లాపల్లెటూళ్లో పడి మగ్గడం?...రాజమండ్రీలాంటి బస్తీలో పడితే, యిది కాకపోతే యింకోటి—ఆఖరికి ఏ'ట్యూష'న్లో'! జీవనోపాధికేమి—

ఇలాగ వొకదానిమీద వొకటిగా ఏవేవో ఆలోచనాపరంపరలు, సినిమాచిత్రంలాగ, పరుగెత్తుకుపోతున్నాయి...ఆ పరధ్యానంలో, గార్డువిజిలూ, రైలుకూతా, చక్రాల మూలుగులూ—ఏదో కలలో సంగతులమల్లే—యింకో లోకపు అలికిడిలాగ—అతి సుతారంగా మాత్రమే చెవినిపడ్డాయి. ఒక్క వూపులో నన్ను దూసుకుని, ఎవరో ప్రయాణీకుడు గమ్మున లోపల పడ్డాడు. ఆ తాకుడికి, నిద్రలో లెంపకాయ తిన్నట్టయింది నాకు! కాస్తలో ప్రమాదం తప్పి, తిరిగి చూసేటప్పటికి అప్పుడే ఆ ఆగంతుకుడు ఒకమూల స్థిరపడ్డాడు...బల్లమీదనే మూటవిప్పి రకరకాల గులాబీ పువ్వు లేవో అతిపదిలంగా సర్దుతున్నాడు! నన్ను తోసుకెళ్లాడని ఓ క్షమాపణా లేదు, ఏంలేదు!—అసలు పెట్టెలో యింకో గండోమనిషి వున్నాడని గుర్తించినట్టే లేదు!

ఎముకలుతప్ప అతని వంట్లో అవాలేం లేదు. మిసమిసలాడుతున్న మస్లిన్ లాల్చీ చిలకొయ్యకి తగిలించినట్టు వదులుగా వేళ్లాడుతోంది...తలకి రాసిన నూనో ఏమిటో—మల్లెలు విరిసినట్టు మత్తెక్కిస్తోంది మెదడుకి...కంఠానికీ, చేతులకీ నిండా మంచిగంధం అదీ—ఆ వేషంఅంతా, ఆ అర్ధరాత్రివేళ, సన్నసన్నగా ఏదో భయంకూడా వేస్తోంది...భయంతోబాటు, అతని ధోరణంతా పరకాయిస్తే—యిదివర కెక్కడో చూసినట్టు అస్పష్టంగా అనుమానం ఏదో మనస్సులో తచ్చాడడం మొదలెట్టింది. పలకరించి చూద్దామని, "ఏవూరు బాబూ మనది?" అన్నాను. రైలు చప్పుడులో వినిపించలేదో, అతని ధ్యానంలో వినిపించుకో లేదోగాని జవాబులేదు.

"అంత తొందరైతే ఎట్లాగండీ? మనుషులున్నారనేనా చూసుకోకుండా—" అని గొంతు హెచ్చించాను. అదురుదెబ్బ తిన్న నాచెయ్యి యింకా జివ్వుమంటూనేవుంది...అప్పుడే యింజను స్పీడందుకుంది. మా పెట్టెలో దీపంకూడా గమ్మున వెలుగెక్కువయింది. "క్షమించా"లని అతను వెర్రిగా, జాలిగా నాకేసి ముఖం ఎత్తి చూశాడు...ఆ చూపులో—

చటుక్కున నాకు జ్ఞాపకంవచ్చింది. అవును, ఆమనిషే—సందేహంలేదు! పదిహేనురోజుల క్రితం,—యిదే శుక్రవారం రాత్రి, యీ బండీకే—యిలాగే ఆఖరిక్షణంలో, హడావుడిగా రైల్లో దూకాడు. అప్పుడింకో కండువా కప్పుకున్నాడుతప్ప, వేషం కూడా యింతే.....అప్పుడుకూడా మా పెట్టెలో మేం యిద్దరమే వుండడం, "ఏవూర"న్న మామూలు ప్రశ్నకి "ఏవూర్లని చెప్పమన్నారు?— ప్రస్తుతం యిక్కడే, నిడదవోలుకి నాలుగుకోసులు పైచిలుకుంది—ఓ చిన్న కుటీరంలో వుంటున్నాను" అని అతను అంటున్నప్పుడు, అలోకసామాన్యంగా రగిలిన అతని కళ్లు అయిదారు రోజులదాకా నాకు మరుపు

రాలేదు. మంచి గంధం, అత్తరూ, పువ్వులూ—యివన్నీ చూసి, మొదట ఏరంగేళీరకమో అనుకున్నానుగాని, ఆ బాపతయితే, అర్ధరాత్రిసమయాని కింకా యీ ప్రయాణంలోనే వుంటాడా?—అయినా, ఆకళ్లు తల్చుకుంటే అటువంటి భావానికి తావే లేదనిపించింది. అతని దేహంలో లోపిస్తున్న మహాజీవితశక్తంతా ఆ కళ్లల్లో అల్లా ప్రజ్వరిల్లుతోందా అనిపించింది....

"చాలా దూరాన్నుంచి నడిచిరావడం—ఎంత తొందరపడ్డా యిలాగే ఆలస్యం అవుతూంటుందండి—నాదే పొరబాటు, క్షమించాలి" అని యింకా నాకేసే చూస్తున్నాడతను.

"ఏదో అవసరం, దానికేం లెండి!...వెనకోసారి, శుక్రవారంనాటి రాత్రే—యిలాగే మనం కలుసుకున్నాం—జ్ఞాపకంవుందో, లేదో?"

ఆముక్క అనేసరికి ఎందుకో అతని ముఖం ఆనందంతో ఒక్కసారి విప్పారింది.

"వారం అంతా యీ శుక్రవారం రాత్రికోసమే నేను జీవించడం!— శుక్రవారంరాత్రి తప్పితే, నాబ్రతుక్కింక ఆశ ఏముంది? అర్థం ఏముంది?"

ఆమాటలు నాకేదో, పొడుపు కథలాగ, బోధపడలేదు...ఆసంగతి చెప్పాను.

"బాబూ, ఆ గాథంతా అగాధం! చాలా వుంది...నన్నూ, నాదేవినీ విడదీద్దామని కుట్రచేసిన లోకం—దానికంట పడకుండానే పోవాలని చూస్తుంటాను, సాధ్యమైనంతవరకు! ... అందులోనూ, దేవి సన్నిధికి వెళ్లే యీ శుక్రవారం రాత్రిపూట, ముఖ్యంగా!...అటువంటి పవిత్రసమయంలో నాకు మీరు తటస్థ పడ్డారంటే—దేవితర్వాత, యీప్రపంచంలో, మీరే నాకు ఆప్తులు!"—

అని అతనెంతో ఆప్యాయంగా — ప్రాణస్నేహితుడితో లాగా—మాట్లాడడం మొదలెట్టాడు...

అతను తన కథంతా చెబుతూంటే, మంత్రముగ్ధుడిలాగా నేను ఆలకించాను. అతని పేరడగలేదు...వూరడగలేదు...మధ్యమధ్య సందేహాలతో ఏమీ అడ్డుప్రశ్న వెయ్యలేదు...ఆవేళంలో అతను హృదయభారం అంతా వెళ్ళబోసుకుంటూంటే, నా కస లేమీ సందేహమే తోచలే దాసమయంలో. అతనికష్టాలూ, అతని అనుభవాలూ అతని జీవితాన్నే క్రమంగా ఆహుతి చేసుకుంటున్న హోమకుండాలలాగ మండిపోయాయతని కళ్లు రెండూను!—ఆ జ్యోతిర్మయనేత్రాల వెలుగులలో అతడు వెళ్ళబోసుకున్న కష్టానుభవం అంతా నాకష్టానుభవంలాగే 'గుండెలు దేవేసింది...

అత నో చిత్రకారుడు.

చిన్నప్పటినుంచీ ఏవేవో బొమ్మలు గీస్తూనే వుండేవాడు. ప్రకృతిదృశ్యాలే మొదటినించీ అతన్ని ఎక్కువగా ఆకర్షిస్తూవుండేవి. నిత్యనూతనంగా వుండే ఉదయాస్తమాన సంధ్యారాగాలు—వేసంగి ఎండలో, వెన్నెలలో, చీకటిలో, శతకోటి స్వరూపాలు ధరించే అనంతసాగర భంగ భంగిమాలు — వినీలాకాశాలలో చిత్ర విచిత్రాలు, నక్షత్రాలు—ప్రకృతిలోని చలచంచల సౌందర్యాన్నే వుపాసించే అతని నేత్రాలకి మొట్టమొదట మనుష్యుల హావభావ విలాసా లేమీ తృప్తి కలిగించలేకపోయాయి. ఎంత తీర్చినా ఏదో ఒక లోపం, ఎంత సహించినా ఏదో ఒక అసహ్యం, ఎంత దిద్దినా ఏదో ఒక మాలిన్యం మనుష్యుల్లో యింకా మరుగుపడి, అతని మనస్సు మల్లించేస్తుండేవిట!.....

అతనింకా ఆధోరణిలో చెప్పుకుపోతున్నాడు.

పెద్ద కూతపెట్టి గమ్మున రైలాగింది.

"అత్తిలీ...అత్తిలీ..." అని మా స్టేషనుపోర్టరు వెంకటసామి కేకలతో ఉలిక్కిపడ్డట్టయింది నాకు... ఏధ్యానంలో దిగానో, టిక్కెట్టిచ్చేసి ఎప్పుడు గేటు దాటానో నాకు గుర్తులేదు. రోడ్డట్టె నడిచిపోతూంటే—

"బాబూ, మీదీ యీతోవేనా?—"

అనే మాటలతో గమ్మున తిరిగి చూశాను. నావెనకాలే అతనూ నడిచి వస్తున్నాడు. ఒక్కక్షణంమాత్రం, అతనిదీ యీత్రోవే కావడం, ఆశ్చర్యం అనిపించింది. కాని ఒక్కక్షణమే ఆ ఆశ్చర్యం—మళ్లీ అతను అందుకున్నాడు; నేను వింటున్నాను—

"...దేవి పరిచయంతో నాభావాలు, సంస్కారం, జీవితమే మారిపోయింది!...ఆవేళ సాయంకాలం—ఎదురింటి డాబామీద—దేవి దర్శనమిచ్చిన ముహూర్తంలోనే నాకు పునర్జన్మ! అంతవరకు, ప్రకృతిలోనే—నాకుంచెకీ, రంగులకీ అందకుండా—తాండవిస్తుండే అవర్ణనీయ సౌందర్యం—అపరూప లావణ్యం అంతా దేవిలో మూర్తీభవించింది. దేవికూడా నన్ను అనుగ్రహించింది. ప్రతిసాయంకాలం, ఆ సంధ్యారుణ కాంతులలో తప్పకుండా కనిపించేది...ఒక్కొక్కనాడు నాదగ్గరకే వచ్చి కూర్చొనేది...వెన్నెల వెలుగులలో దేవివెంట విహారాలు చేశాను. గోదావరి కెరటాలలో దేవిఅందచందాలు వెన్నెలలలో మిలమిలలాడుతుంటే చూశాను...నాకుంచె కొత్త కొత్త విలాసాలతో పరవళ్లు త్రొక్కింది...నా రంగుల కలయికలో యిదివర కెన్నడూ సాధ్యంకాని అపరూపచ్ఛాయలు పట్టుబడ్డాయి ... రోజులు, వారాలు, నెలలు దేవి విలాసాలు చిత్రిస్తూ, నాకళ యీనాటికి ధన్యమయిందనుకున్నాను...కాని, బాబూ, లోకం—లోకం!-లోకానికి మాసంబంధం అర్థంకాలేదు. ఎలా అర్థంఅవుతుంది?—అర్థంకాని దల్లా తప్పనేవాళ్ల యమచరలో దేవి ఎన్నోబాధలు పడింది..."పెళ్లయిన పిల్ల కిదేం బుద్ధన్నారు ... తిట్టారు ... దుయ్యబట్టుకున్నారు... అమ్మబాబోయ్!... తండ్రి, మేనమామ, లోకులు—అంతా కలిసి కుట్రచేశారు ... చివరికి దేవిని చంపేశామన్నారు కూడా! ... కాని, బాబూ, దేవతలకి చావేమిటి?...యిక్కడికి రెండుమైళ్లలోనే వుంది దేవి మేనమామలగారి వూరు...అక్కడే ఆఖరుకి దేవిని మాయంచేశామనుకున్నారు వాళ్లు...కాని ఆ నాటి రాత్రే దేవి పిలిచింది నన్ను...వచ్చి వాలాను ...వూరికి చేరువునే వున్న చెరువుగట్టుమీద దేవి నాకోసం యింకో అవతారంలో దర్శనమిచ్చింది... మాట్లాడింది...యిదివరకులాగే నా కళాజీవితం నెరవేర్చుకుంటూవుండమని ఆదేశించింది. సన్నిధానంలో ఆ వూళ్లోనే వుండిపోతానంటే వద్దంది దేవి!..."నిత్యం నా దగ్గరే కూర్చుంటే యింక చిత్రా లెప్పుడు రాస్తారు?...నిడదవోలుదగ్గ రెక్కడో మీ బంధువులున్నారన్నారుగా?...అక్కడెక్కడో వాళ్లకి దగ్గరగా వుండి, మీ కళాసేవకి భంగం రానియ్యకండి... శుక్రవారం — ప్రతిశుక్రవారం — రాత్రి పన్నెండు గంటలు దాటాక, తప్పకుండా వస్తుండండి...నక్షత్రకాంతులలో—వెన్నెలలో—మసగచీకట్లలో – మంటలలో—కొత్తకొత్తగా నన్ను చూసి చిత్రిస్తుందురుగాని!..." అని దేవి నిర్దేశించింది...అప్పటినించి ప్రతి శుక్రవారం రాత్రీ—అదే చెరువుగట్టున దేవిని కలుసుకుంటున్నాను...ఎన్నో వేషాలతో, ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా దేవి కనిపిస్తుంటుంది...ఆ రాత్రిదర్శనమే తతిమావారంరోజులూ పాటుబడి చిత్రించడానికి ప్రయత్నిస్తుంటాను...పట్టుకొచ్చి ఎప్పటికప్పుడు దేవికి చూపిస్తాను..."—

అతను హఠాత్తుగా ఆగాడు. మాట నొక్కినట్టు నేనూ ఆగాను. ఆవేళ ఏకాదశో, ద్వాదశో అప్పుడప్పుడే మబ్బులమాటునించి చంద్రు డుదయిస్తున్నాడు ...చుట్టూ ఎక్కడా యింకా జనసంచారం లేదు. ఆకుకూడా అల్లల్లాడకుండా ప్రకృతంతా గాఢనిద్రలో వుంది. అతనేవో చిత్రాలు చుట్టలువిప్పి చూపిస్తున్నాడు...మసగవెన్నెలలో నేను చూస్తున్నాను... పక్కనున్న వల్లకాళ్లలో చితి ఏదో కాలుతోంది... ఆ మంటలవెలుగు అప్పుడప్పుడు చిత్రపటాలమీద పడి తళుక్కుమంటోంది...

"...చూశారా, యిది గ్రీసుదేశస్త్రీవేషం... యిందులో దేవి చైనా నాట్యకత్తెగా దర్శనమిస్తోంది ...యిది ఒక భారతనాట్యభంగిమంలో దేవిఅవతారం..." అని అతను, అంతకంతకి హెచ్చిపోతున్న ఆవేశంతో—ఆవేగంతో — పదిపన్నెండు చిత్రాలు చూపించాడు...నేను సమ్మోహితుడ నయాను ... దిగ్భ్రమచెందాను...ఎవ రాస్త్రీ?...అసలు స్త్రీయేనా?...మానవులలో కనిపించే అందం కాదది... ఈ లోకానిది కాదాలావణ్యం...అపరూపం, అతిలోకసామాన్యం ఆ సౌందర్యం!...వెర్రిగా కళ్లప్పజెప్పి నేనలాగే చూస్తున్నాను...

అతను మళ్లీ చిత్రాలన్నీ జాగ్రత్తగా చుట్టబెట్టుకుని "యింకా నా కుటీరంలో కొన్ని వున్నాయి

మీ రోసారి తప్పకుండా రావాలి...వస్తారుకదూ ?" అని నాచేత వాగ్దానం చేయించుకున్నాడు..."వేళ యింది...నా కింక సెలవు" అని, చటుక్కున, ఏదో మరిచిపోయిన సంగతి జ్ఞాపకంవచ్చినట్టుగా, హఠాత్తుగా రోడ్డుపక్క పుంతదారినే చరచరా వెళ్లి పోయాడు...

ఎవరో పాలేరు, పొలానికి పెంట తోలుకెడుతున్నాడు—ఘల్లుఘల్లుమని ఎద్దుల మువ్వల చప్పుడు రోడ్డుమళుపు తిరిగి ఆ పుంతదారే పట్టింది...

పొలంగట్టే వెడితే మావూ రక్కడికి మైలున్నర దూరం వుంటుంది. పుంతమ్మటే యింకో మైలుచుట్టు. అయినా ఎందుకో నా కాళ్లు అప్రయత్నంగా ఆపుంత దారే తొక్కాయి...ఆ చిత్రపటాలలోని సౌందర్యం అస్పష్టంగా నా కళ్లముందర యింకా తాండవిస్తూనే వుంది...

పుంతదారిని కొంతదూరం నడిచేటప్పటికి, ఏవో మాటలు వినిపించినట్టుయింది...మనుష్యుల అలికిడేమోనని పక్కకి చూశాను...

అప్పుడు నా కంటబడ్డ దృశ్యం యీజన్మకి మరచిపోను—

అవతలగా—మామిడితోపుమధ్య, చెరువుగట్టు మీద, అదే దేవసుందరి!...దేవి!...పక్కనే అతను! పచార్లు చేస్తున్నారు!—

మల్లులు, జాజులు, పద్మాలు—ఎక్కడెక్కడి లావణ్యమో నే చెప్పలేను, ఆముఖంలో తొణికిసలాడుతోంది...వెన్నెలలు చీరగా ధరించింది...మిలమిలలాడే ఏ చిన్నిచిన్ని అలలో రవికతొడిగింది...అతని చిత్రాలలో ఏవో కొన్ని ఛాయలు మాత్రమే గోచరించే చలచంచల సౌందర్యకసాధిదేవత సాక్షాత్కరించింది... అతడిని—ఆ కళాజీవిని—అనుగ్రహిస్తోంది!...

ఎంతసేపు అలా చూస్తూ నిలిచిపోయానో జ్ఞాపకంలేదు. ఇదంతా కలా, నిజమా అని నామతి చంచలించి పోయింది...

జాగారం వేడికి, నడకకి నాకాళ్లు పొడుస్తూనే వున్నాయి...

ఆ రాత్రి ఎప్పుడు యిల్లుచేరుకున్నానో—ఎప్పుడు నిద్రపోయానో—నాకు తెలియదు...

మర్నాడు లేచేసరికి పదిగంటల పొద్దెక్కి పోయింది. కాఫీ పట్టుకుని మాఆవిడ "ఏమిటీనిద్రండీ!" అంటూనే ఎదురుగుండా హాజరయింది. రాత్రి నాఅనుభవం అంతా ఏదో మందుమాటుగాథల్లే మసగ మసగగా తోచింది...తూచా తప్పకుండా సీతకి అదంతా చెప్పాను. ఆశ్చర్యం ఏమీ పోలేదు సరిగదా, పైగా, చిరునవ్వోటి నవ్వేసింది!—

"నే నంటూనే వున్నాను కాళ్లు కడుక్కోం డని—వినిపించుకున్నారు కాదు...పీడకలేదో వచ్చిందంటే రాదూ?" అనేసింది!

"కలకాదు సీతా, నిజంగా జరిగిందంటే నమ్మ వేం ?...అతను, నాతోనే, రైల్లో ప్రయాణం చేశాడు...మాట్లాడాడు"

"అయితే ఏ కామినీదయ్యాలో—"

"ఎవరు ? అతనూనా ?...రాసిన చిత్రాలెన్నో నాకు స్వయంగా చూపించాడు—"

"ఆదయ్యాలు అంతేటలెండి ! ఎన్నో మాయలు చేస్తాయిట !...వెనకటి కోసారి మాబాబయ్య—"

అంటూ ఏదో దయ్యాలకథ ప్రారంభించింది.

అంతే, ఆనాటినించి, యింక ఎవళ్లదగ్గరా నే నాసంగతి ఎత్తనూలేదు, ప్రతిశుక్రవారం నే నలాగే ప్రయాణాలు చేస్తున్నా నా కతను మళ్లీ తటస్థపడనూ లేదు. కొన్నాళ్లపాటు నామనస్సులో మెలుగుతూ వచ్చిన ఆరాత్రిఅనుభవం క్రమంగా కాలంపో మాయలో అంతరించబోయింది.

మూడునెలలయాక నేను మామూలుగా అదే రాత్రి బండిక్కి రాజమండ్రీనించి తిరిగొస్తున్నాను. రైలు చాగల్లుస్టేషన్ దాటింది. నిడదవోలు సమీపిస్తున్నానని గొల్లున కూతకూడా పెట్టింది. ఇంతలో—

గమ్మున బ్రేకడింది !—

'కుయ్యో'మని బంఢాగింది !—

జనం ఏదో ప్రమాదమన్నారు !

అందరికంటే ముందు నేనే దూకి పరుగెత్తాను. ఇంజనుముందు—

పట్టాలకడ్డంగా—

ఒక మనిషి !

తల బద్దలై, నెత్తు రింకా తడితడిగానే వుంది. దగ్గర కెళ్ళి పరకాయించేసరికి నావళ్లు ఝల్లుమంది—

అతను !—

అతనే—సందేహం లేదు!—ఆశుక్రవారంరాత్రి ప్రయాణాలు చేసే దేవీచిత్రకారుడు !

ఇంజనుదీపంవెలుగులో, అతనికి కొంచెం దూరంలోనే ఏదో పుస్తకం !—

తీసి చూశాను. పేరులేదు !... పేజీలు తిరగేశాను... 'దేవి' ... 'లక్ష్మి!' ... 'లక్ష్మిదేవి!'... పేజీ పేజీకీ అదేపేరు !...ఆవిడదే చరిత్ర...

దానవాయిపేట ప్లీడరుగారింట్లో వంటలక్క లక్ష్మికథంతా చెబుతూ—"అదేం చిత్రమో చూడండి, ఆ పిల్ల పోయిననాటినించీ ఆ అబ్బాయికూడా ఎక్కడా పత్తాలేదుట !...లక్ష్మితోటే అతనూ మాయమయాడేమో!" అన్న మాటలు నాస్మృతిపథంలో తళుక్కున మెరిశాయి.

ఆ పుస్తకం యింకో పేజీలో—

"శుక్రవారం రాత్రి బంధువు...నా కుటీరానికి వస్తానన్నారు...నా తర్వాత దేవీచిత్రాలు లోకులకంట బడకుండా ఆయనకి వప్పజెప్పాలి..." అనే ముక్కలున్నాయి.

అప్రయత్నంగానే నా కళ్లంట నీళ్లు గిర్రున తిరిగాయి...

"మీ బంధువులా ?"

తలెత్తి చూశాను—పోలీసు జవాను !

"అవును" అన్నాను...ఎందుకో, దుఃఖం గొంతుక్కి అడ్డంపడింది!...

"కాస్త రాసుకోవాలి — పేరేమిటండీ ?" అన్నాడు జవాను.

పేరు ?... పేరు ? ... నే నెప్పుడూ అడగనూ లేదు...అతను చెప్పనూలేదు. దేవినిర్దేశానుసారం, దేవి దర్శనానికని ప్రతిశుక్రవారం ఆప్రయాణాలు చేసే ఆపథికుడి పేరు—

"దేవీపథ" అన్నాను చటుక్కున.

పోలీసుజవా నోమూల రాసుకుంటూనే "దేవీపథా?...అదేఁ పేరండీ ?" అన్నాడు.

నిజమే—అదేం పేరు ?—

